క్లుప్తంగా

మహాధర్నాను విజయవంతం చేయాలి

జనగామ రూరల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శనివారం తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 80 లక్షల మంది మాదిగలకు కాంగ్రెస్ నమ్మక ద్రోహం చేసిందని అన్నారు. మహాధర్నాకు అధిక సంఖ్యలోమాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. రవి, సోమరాజు, ఉపేందర్, రాము, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దుర్గామాత ఉత్సవాలు

బచ్చన్నపేట : మండలంలోని బసిరెడ్డిపల్లిలో దుర్గామాత ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గ్రామంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని శనివారం మొదటి రోజు దుర్గామాతకు రాత్రివేళ ఊరంతా కలిసి బోనాలు చేసి చెల్లించడం, అలాగే కళ్యాణం జరుగుతాయన్నారు. ఆదివారం ఊరంతా కలిసి వనభోజనాలకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఎలాంటి అల్లర్లు జరుగకుండా ఎస్సై సతీష్‌కుమార్ భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.

పనిచేసే వారికి పట్టం కట్టండి

బచ్చన్నపేట : ప్రజా సమస్యల కోసం పోరాడుతూ వారి సమస్యలను తీర్చడానికి పనిచేసే నాయకునికి పట్టం కట్టాలని సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు గొబ్బెట రఘుపాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థిగా జహంగీర్ గెలుపు కోసం ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.వీ.రమణ, ప్రసాద్, మండల కార్యదర్శి వెంకటేష్, అశోక్,, నర్సింహులు, సుధాకర్, ఈదమ్మ, శోభ, పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి



స్టేషన్‌ఘన్‌పూర్: కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ మతతత్వ రాజకీయాలు చేసే బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ దేశాన్ని సర్వనాశనం చేసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసిందన్నారు. సీపీఎం బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బెలిదె వెంకన్నగుప్తా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సారంగపాణి, సీపీఎం మండల కార్యదర్శి రమేష్, యాకయ్య, మల్లారెడ్డి, రాములమ్మ,భాస్కర్, సుదర్శన్, పాల్గొన్నారు.

మొక్కలను రక్షించుకోవాలి

బచ్చన్నపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలను రక్షించుకోవడానికి అందరూ కృషి చేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలింపూర్‌లో వన నర్సరీ, పల్లె ప్రకృతి వనం, రోడ్లకిరువైపులా నాటిన మొక్కలు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మొక్కలు తొందరగా వాడిపోతున్నాయని అన్నారు. వాచర్లు తమ పరిధి మేరకు జీపీ వాటర్ ట్యాంకర్లచే నీటిని పట్టాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్, కారోబార్ మురళి పాల్గొన్నారు.

కడియం కావ్యను చిత్తుగా ఓడించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల్లో దళిత ద్రోహి కడియం శ్రీహరికి గుణపాఠం చెబుతూ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను చిత్తుగా ఓడించాలని వరంగల్ పార్లమెంట్ స్వతంత్ర్య అభ్యర్థి మంద నరేష్ కోరారు. డివిజన్ కేంద్రంలో కూలర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆయన శుక్రవారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పవన్‌కల్యాణ్, మధు, రాజు, సూర్య, సాయి, లక్ష్మణ్, నరేందర్, కార్తీక్, రాజ్‌కిరణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న అభిమాని



జనగామ రూరల్: ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి సీఎం అయితే తిరుపతి కొండకు నడుచుకుంటూ వెళ్లి మోకాళ్ల పర్వతంలో మోకాళ్ల మీద వెళ్తూ దర్శించుకుంటానని యశ్వాంతాపూర్‌కు చెందిన దాసరి సతీష్ శుక్రవారం తిరుపతి మెట్లు ఎక్కాడు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేయడంతో తాను సంతోషంతో మొక్కులు చెల్లించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ స్థానాలు అత్యధికంగా గెలవాలని కోరాడు.

కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దు

- కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తి టౌన్ : మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



జఫర్‌గఢ్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: అబద్ధాల కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మి మోసపోవద్దని, తెలంగాణ రాష్ట్ర సాధన చేసిన కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. వావిలాల, మల్లంపల్లి, దర్దేపల్లి, కొండాపురం, వల్మిడి, ముత్తారం, మంచుప్పుల, చెన్నూరు, విస్నూరు, లక్ష్మీనారాయణపురం, తొర్రూరు, ఈరవెన్ను, గూడూరు, బమ్మెర, పాలకుర్తి ఎంపీటీసీల పరిధిలోని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి దయాకర్‌రావుతో పాటు మాజీ స్పీకర్ మధుసూదనాచారిలు మాట్లాడుతూ ఎన్నికల్లో చేయాల్సిన తీరుపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ చైర్మన్ రాంబాబు, బీఆర్ఎస్ మండల కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, పాల్గొన్నారు.

కడియం రాజకీయాలకు సమాధి కట్టాలి: పల్లా

జఫర్‌గఢ్ : మోసకారి కడియం శ్రీహరి రాజకీయాలకు సమాధి కట్టాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు పల్లెపాటి జైపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యలు హాజయ్యారు. ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నీతి వంతుడు అని చెప్పుకునే కడియంకు ఏమాత్రం సిగ్గు, శరం, రోషం, పౌరుషం ఉంటే వెంటనే గులా బీ కండువతో గెలుపొందిన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎన్నికలకు సిద్ధపడాలని సవాల్ చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ కడియం శ్రీహరి నరరూప రాక్షసుడు, కుమ్మరి పురుగులాంటివడని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కుమార్, మహేందర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు యార నీలమ్మ సోమిరెడ్డి, నాయకులు బుచ్చయ్య, కడారి శంకర్, రాజయ్య, రాజ్‌కుమార్, కోత్వాల కుమార్, ఎస్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలి

కొడకండ్ల : పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎం.సుధీర్‌కుమార్ గెలుపు కోసం కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెట్టు శ్రీను కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిందె రామోజీ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ రాము, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, నాయకులు అభిమన్‌గాంధీ, సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలి



రఘునాథపల్లి : కోమల్లలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ వరలక్ష్మి

రఘునాథపల్లి: వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ మేకల వరలక్ష్మి కోరారు. శుక్రవారం మండలంలోని కోమల్లలో ఆమె కాంగ్రెస్ నాయకులతో కలిసి చేతి గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలంలోని పొట్టిగుబ్బటితండా, ఆంధ్రతండా, ఖిలాషాపూర్, రామచంద్రగూడెంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జగదీష్‌చందర్‌రెడ్డి, జెడ్పీటీసీ అజయ్, రాంబాబు, నరేందర్, రవిగౌడ్, మహేందర్‌రెడ్డి, యువరాజ్, పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: సీపీఎం బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకులు ఏదునూరి వెంకట్రాజ్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండె యాదగిరి, బేతి రత్నాకర్‌రెడ్డి, మారపాక వసంత్, శ్రీను, సంపత్, సుదర్శన్, పాల్గొన్నారు.

చిల్పూరు: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చిల్పూరు ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, మర్రి దుర్గాప్రసాద్, జయప్రకాష్, వెంకట్‌రెడ్డి, సుధాకర్, యాదగిరి పాల్గొన్నారు.

జనగామ రూరల్: మండలంలోని వడ్లకొండలో మండల ప్రధాన కార్యదర్శి అనిల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మేందర్, నగేష్, ప్రభాకర్, భూపతి, సిద్దిమల్లయ్య, మల్లేష్, మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల : వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలపించాలని మహిళ కాంగ్రెస్ జిల్లా నాయకురాలు, ధరావత్ రోజా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్‌లు కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు నసీరుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ : మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గత మూడు రోజుల నుంచి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు అన్నెబోయిన భిక్షపతి, మంచాల ఎల్లయ్య, కుల్లా మోహన్‌రావు, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, ఇల్లందుల స్రవంతి మొగిళి, నర్సింగం, నీలం రాజయ్య, మంచాల అనిల్, సముద్రాల సత్యనారాయణ, నంచర్ల యాదగిరి, ఉల్లి శివరాజు పాల్గొన్నారు.

‘చామల’ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం



జనగామ: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బచ్చన్నపేట : ప్రచారం నిర్వహిస్తున్న శ్రీధర్

జనగామ : పట్టణంలోని శివాలయం వీధి, నాగుల కుంట్ల, పాతబీట్ బజార్, నెహ్రూ పార్క్, అండర్ బ్రిడ్జి ఏరియాలో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తరఫున డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో 24వ వార్డు అధ్యక్షుడు నోముల సోమయ్య, మల్లేష్, సుజాత, సెదమ్మ, బండ సత్తమ్మ, యాదమ్మ, సమ్మక్క, రమ, అండాలు ఉన్నారు.

బచ్చన్నపేట : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం మండలంలోని పలు గ్రామాల్లో ఆయా గ్రామాల అధ్యక్షుల ఆధ్వర్యంలో శుక్రవారం జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలలో గుర్తును చూపిస్తూ ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

రఘునాథపల్లి: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వరంగల్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మండలంలోని కంచనపల్లిలో జరిగిన పోలీస్ కళాజాతాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి పౌరుడు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించినా, ప్రజలను ఇబ్బందులకు గురి చేసినా అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై దూదిమెట్ల నరేష్, కళాజాత బృందం పాల్గొన్నారు.

వామపక్ష, లౌకిక శక్తులను బలపర్చాలి



లింగంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న రమేశ్

చిల్పూరు : కార్మిక వ్యతిరేక మతోన్మాద బీజేపీని ఓడించి వామపక్ష లౌకిక శక్తులను బలపర్చాలని సీఐటీయూ యూనియన్ మండల ఇన్‌చార్జ్ సాదం రమేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని లింగంపల్లిలోని సమ్మక్క–సారలమ్మ గుడి ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద హమాలీల సమావేశం సీఐటీయూ హమాలీ సంఘం మండల అధ్యక్షుడు రాజు అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు వికసిత్ భారత్, సుస్థిర అభివృద్ధి, రామరాజ్యం అంటూ కొత్త నినాదాలు చేస్తుందని ఈ ప్రచారాలను ప్రజలు ఎవరూ నమ్మొద్దని కోరారు. ప్రతి ఒక్కరూ ఇండియా కూటమి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని రమేశ్ కోరారు.

పాత్రికేయులకు సన్మానం



దేవరుప్పుల : అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు కాసాని సత్తయ్య, జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు విజయ్‌కుమార్, లక్ష్మీపతి, వేణుమాధవ్, రవీందర్‌రెడ్డి, సందీప్, సుధాకర్, శేఖర్, సోమలింగం, విక్రమ్, సారయ్య, గోవర్ధన్, ఎల్లేష్, సోమేష్, శ్రీకాంత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బొడ్రాయికి జలాభిషేకం



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

రఘునాథపల్లి: మండల కేంద్రంలో విజయదుర్గాదేవి, రేణుక ఎల్లమ్మ దేవతల ఉత్సవాల ప్రారంభంలో భాగంగా శుక్రవారం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో బొడ్రాయికి జలాభిషేకం చేశారు. విజయదుర్గాదేవి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మాజీ సర్పంచ్ పోకల శివకుమార్–లావణ్య దంపతులు వేద పండితులు సంతోష్‌శర్మ, పుల్లయ్యశర్మ మంత్రోచ్ఛరణలతో దుర్గాదేవికి పంచామృతాభిషేకం చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. శనివారం విజయదుర్గాదేవి, ఎల్లమ్మ, పోచమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ దేవతలకు బోనాలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొల్లం అజయ్, ఎంపీటీసీ పేర్ని ఉషారవి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో నీరు వృథా



జనగామ రూరల్: మండలంలోని గానుగుపహడ్ పరిధిలోని కొర్రతండాలో గత కొన్ని రోజుల నుంచి మంచినీటి పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. వేసవికాలం మంచినీటి ఎద్దడి దృష్ట్యా మంచి నీటిని పొదుపు చేయాల్సి ఉండగా గ్రామ కార్యదర్శి, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నీరు వృథాగా పోతుంది. అధికారులు మరమ్మతులు చేసి నీరు వృథా కాకుండా చూడాలని తండా వాసులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సుస్థిర దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు కోలుకొండ, పెద్దమడూరు, సింగరాజుపల్లి, రామరాజుపల్లి, నీర్మాల గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రసంగించారు. ప్రత్యేక రాష్ట్రం పేరిట బీఆర్ఎస్‌కు తెలంగాణను అప్పగిస్తే అప్పుల పాలు చేసిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్ల శ్రీరాములు, ఉప్పల సురేష్‌బాబు, ధర్మారెడ్డి, నల్ల సత్యనారాయణ, ఎంపీటీసీ దామెర రమ, అనిల్‌కుమార్, మల్లారెడ్డి, చింతల రవీందర్‌రెడ్డి, కృష్ణ, గణేష్, నాగరాజు, పాండు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ నిర్వహించిన అధికారులు



ఘన్‌పూర్‌లో ఓ దివ్యాంగుడి ఇంటి వద్ద హోం ఓటింగ్ నిర్వహిస్తున్న అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్.వెంకన్న ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులు, సిబ్బంది శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో హోం ఓటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 3 నుంచి 5 వరకు దివ్యాంగులు, వృద్ధుల కోసం హోం ఓటింగ్ అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. మొదటి రోజు మంచి స్పందన వచ్చిందని శని, ఆదివారాల్లో కొనసాగుతుందని తెలిపారు.

హోం ఓటింగ్‌ను వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్ : 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే నిర్వహించే హోం ఓటింగ్‌ను వినియోగించుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. మండలంలోని హిమ్మత్‌నగర్‌లో 85 ఏళ్ల పైబడిన వృద్ధురాలు తమ ఇంటివద్దే ఓటు హక్కును శుక్రవారం వినియోగించుకుంది.

9 మంది హోం ఓటింగ్ బ్యాలెట్

నర్మెట: మండలంలో 39 మంది ఉండగా మండల కేంద్రానికి చెందిన వారు 11 మంది, కాగా శుక్రవారం 9 మంది హోం ఓటింగ్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సెక్టార్ అధికారి ఎ.రవి, పీఓ డి.శ్యాం, పీసీ కె.శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి

దేవరుప్పుల : మండలంలోని పడమటితండా (డీ)కు చెందిన కాంగ్రెస్ నాయకుడు జాటోతు వీరన్న భార్య జాటోతు విమల రోడ్డు ప్రమాదంలో గాయపడగా శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. వారి వెంట కామారెడ్డి గూడెం ఎంపీటీసీ మహ్మద్ జాకీర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్య సజ్జన్ నాయక్, నాయకులు తదితరులు ఉన్నారు.

బచ్చన్నపేట : మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన రాగిశెట్టి భాగ్యమ్మ కుటుంబ సభ్యులకు భవననిర్మాణ రంగ కార్మికులు ఆర్థికసాయాన్ని అందించారు. శుక్రవారం బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.11,500లు అందించారు. పరామర్శించిన వారిలో నాయకులు ఎల్లయ్య, కిష్టయ్య, రాజు, రవి, నర్సయ్య, ఉప్పలయ్య ఉన్నారు.

జనగామ రూరల్: మండలంలోని పెద్దపహాడ్‌కు చెందిన నామాల రవి తాటిచెట్టుపై నుంచి కిందపడడంతో వెన్నుపూస విరిగింది. దీంతో మంచానికే పరిమితమయ్యాడు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభిగౌడ్ రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట గ్రామ శాఖ అధ్యక్షుడు వేణు, రాములు, శ్రీనివాస్, భిక్షపతి ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండకు చెందిన యార పెద్దకొమురయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందగా వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఎడమ కట్టమల్లు, మల్లేశం, సంపత్, శ్రీను, కుమార్, రమేష్, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలి



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయం పరిశీలకులు దీలిభన్

జఫర్‌గఢ్ : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల వ్యయం పరిశీలకులు దీలిభన్ కోరారు. జఫర్‌గఢ్ శివారు నల్లబండ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. వాహనాల తనిఖీని ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, పోలీస్, వివిధ శాఖలకు చెందిన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య

దేవరుప్పుల: కుటుంబ ఆర్థిక స్థితిగతులు, పాలివారి పంచాయతీ విషయాల్లో తరచూ మానసికంగా ఇబ్బంది పడుతూ ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మున్‌పహాడ్‌లో జరిగింది. ఎస్సై ఎస్.చెన్నకేశవులు కథనం ప్రకారం.. మండలంలోని మున్‌పహాడ్‌కు చెందిన మామిళ్ల అహల్య (54) ఇటీవల గ్రామంలో దుర్గమాత ఉత్సవాలతో కొంత అప్పు చేయడంతో పాత అప్పులు కలిపి ఎలా తీరుస్తామని కుటుంబ సభ్యులతో చెబుతూ కలత చెందేదన్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కొడుకు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఊరకుక్కల దాడిలో జీవాలు మృతి

బచ్చన్నపేట : ఊరకుక్కల దాడిలో జీవాలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన తుప్పతి భవాని–మల్లేష్ దంపతులు రోజు మా దిరిగానే తన జీవాలను దొడ్డిలో తోలి ఇంటికి వచ్చి నిద్రించారు. ఉదయం లేచి వెళ్లి చేసే సరికి జీవాలు విగత జీవుల్లా పడి ఉన్నాయని, కొన్ని గాయాలతో విలవిలలాడుతూ ఉన్నాయని తెలిపారు. కుక్కల దాడిలో 19 జీవాలు చనిపోయాయని, పలు గాయాల పాలయ్యాయని ఈ ఘటనలో రూ.1.20 లక్షల నష్టం వాటిల్లిందని అన్నారు. ఘటనా స్థలం వద్దకు మండల వైద్యాధికారి రామారావు చేరుకొని పంచనామా చేశారు. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, ఊర కుక్కల బెడదను నివారించాలని పలువురు కోరారు.

మంథోనిగూడెంలో అగ్ని ప్రమాదం



లింగాలఘణపురం: మండలంలోని మంథోనిగూడెంలో మధు తన పొలంలో కొయ్యకాలును కాలబెడుతుండగా మంద దయాకర్ పొలంలోనికి వ్యాపించి అతనికి సంబంధించి పశుగ్రాసం, మామిడిచెట్లు అంటుకుని సుమారు రూ.80వేల నష్టం వాటిల్లింది. మధు కొయ్యకాలును కాలబెడుతుండగా మంటలు దయాకర్ పొలంలోకి వ్యాప్తించి సుమారు ఎకరన్నర పశుగ్రాసంతో పాటు 35 వరకు గడ్డి కట్టలు, మామిడి తోటలో కొన్ని చెట్లు, పొలంలో కట్టేసిన పాడి పశువుకు గాయమైంది. జనగామ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా మంటలను ఆర్పారు.

వ్యక్తిపై కేసు నమోదు

లింగాలఘణపురం: మండలంలోని వడిచర్లకు చెందిన కొంగరి నరేశ్ అక్రమంగా పశువులను కబేళాలకు తరలిస్తుండగా శుక్రవారం వడిచర్ల వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. ఎనిమిది పశువులను నవాబుపేట అంగడిలో కొనుగోలు చేసి అక్రమంగా హైదరాబాద్ కబేళాలకు తరలిస్తుండగా పెట్రోల్ బంక్ వద్ద పట్టుకొని పశువులను గోశాలకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

నిప్పంటుకుని గడ్డి దగ్ధం

పాలకుర్తి : మండలంలోని రాఘవపురం స్టేజీ సమీపంలో ఉన్న గడ్డికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని శుక్రవారం రాత్రి దగ్ధమైన సంఘటన శుక్రవారం జరిగింది. ఈ విషయమై స్టేషన్‌ఘన్‌పూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలను ఆర్పివేశారు.

ఘనంగా కంఠమహేశ్వరస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన శ్రీ కంఠమహేశ్వరస్వామి–సురమాంబదేవి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద పురోహితుడు రామచంద్రమూర్తి వేదమంత్రాల మధ్య నిర్వహించిన కంఠమహేశ్వరస్వామి కల్యాణ ఉత్సవానికి గౌడ కులస్తులు, భక్తులు అధికసంఖ్యలో హాజరై పూజలు చేశారు. కల్యాణమహోత్సవంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్యక్రమంలో గౌడ కులస్తులు, భక్తులు పాల్గొన్నారు.